సాక్షి మంచిర్యాల

సోమవారం ၊ 29 ၊ సెప్టెంబర్ ၊ 2025



మూలనక్షత్ర పూజలకు సిద్ధం

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాసరలో జ్ఞాన సరస్వతి ఆలయం సోమవారం మూల నక్షత్ర పూజలకు ముస్తాబైంది. ఉదయం 11 గంటలకు పూజలు జరగనున్నాయి. 8లో▸



పార్ట్‌టైం ఉద్యోగులు పస్తులేనా?

ఎస్సీ గురుకులాల్లో పనిచేసే పార్ట్‌టైం ఉపాధ్యాయులకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో పండుగపూట పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2 /26.3

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



వరదనీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున గోదావరిలోకి వచ్చి చేరుతోందని, పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నదీ తీరంలోని నీటిమట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమీపంలోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

చెన్నూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు శిక్షణ తరగతులు దోహదపడుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. స్థానిక బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను డీపీవో వెంకటేశ్వర్‌రావు, సర్వేలాండ్ ఏడీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. శిక్షణ తరగతులకు హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీవోను ఆదేశించారు.

అందుబాటులో యూరియా

చెన్నూర్‌రూరల్: జిల్లాలో పంటల సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సుద్దాలలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఏవో యామిని, ఎంపీడీవో మోహన్‌తో కలిసి సందర్శించారు. యూరియా నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు.

కాకో ఆలయంలో జెండా ఆవిష్కరణ



జెండాకు మొక్కుతున్న నాయకులు

దండేపల్లి: తెలంగాణాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గుడిరేవులో గోదావరి నది ఒడ్డున గల ఆదివాసీల ఆరాధ్యదైవం శ్రీపద్మల్‌పురి కాకో ఆలయంలో ఆదివారం దసరా పండుగను పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆదివాసీ గిరిజన నాయకులతో సమావేశమై అశ్వియుజ పౌర్ణమి నుంచి దీపావళి వరకు ఆలయంలో నిర్వహించే దండారీ ఉత్సవాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన వసతులు కల్పించేలా ఆలయ కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేయాలన్నారు. వసతుల కల్పన, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోము, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాషష్టి పూజ



పూజల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ చంద్రయ్య, మాజీ మంత్రి బోడ జనార్దన్, బెంగాళీలు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో సర్వజనినీ దుర్గాదేవి నిర్వాహక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద ఆదివారం వైభవంగా దుర్గాషష్టిపూజ నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ముందుగా మహిషాసురిడికి పూజలు చేశారు. అనంతరం కలశపూజ, విగ్రహాల ప్రతిష్ఠాపన, కలశాలను ఏర్పాటు చేశారు. అఖండ జ్యోతితో హారతి కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు అదనపు కలెక్టర్ చంద్రయ్య, మాజీమంత్రి జనార్దన్ అఖండజ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో హైకోర్టు ఏజీపీ సైదం లక్ష్మీనారాయణ, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు చంచు రాజ్‌కిరణ్, సార్వజనని దుర్గాదేవి నిర్వాహక మండలి అధ్యక్షుడు బోడ ధర్మేందర్, సభ్యులు రీనారాణి దాస్ పాల్గొన్నారు.

3న దసరా సెలవు ఇవ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు అక్టోబర్ 3న దసరా సెలవు ఇవ్వాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్టోబర్ 2న దసరా సెలవు ప్రకటించడం, అదే రోజు గాంధీ జయంతి ఉండడంతో పండుగ జరుపుకోవడం లేదని తెలిపారు. తెలంగాణ సంప్రదాయం ప్రకారం కార్మికులు దసరా రోజున మైసమ్మకు మేకలు, గొర్రెలు, కోళ్లతో మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

నగరం.. అంధకారం!



బెల్లంపల్లి చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వైపు వెళ్లే దారిలో పనిచేయని సెంట్రల్ లైటింగ్ సిస్టం

- పండుగల వేళ అలుముకున్న చీకట్లు
- సగానికిపైగా వెలగని వీధి దీపాలు
- చేతులెత్తేసిన నగరపాలక సంస్థ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలో చీకట్లు కమ్ముకున్నాయి. ఆయా కాలనీల్లో వీధి దీపాలు పాడైన చోట కొత్త వాటిని ఏర్పాటు చేయడంలో జరుగుతున్న జాప్యంతో పండుగపూట ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో చీకట్లోనే వీధుల గుండా వెళ్లాల్సి వస్తోంది. బతుకమ్మ పండుగను ఆడబిడ్డలు ఘనంగా జరుపుకుంటారు. ఇళ్లల్లో బతుకమ్మలను పేర్చి, వీధిలో ఒక చోటపెట్టి అంతాకలిసి ఆడుకుంటారు. కానీ ప్రస్తుతం నగరంలోని పలు డివిజన్లలో వీధిలైట్లు లేక చీకట్లోనే బతుకమ్మలు తీసుకెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. దీనికితోడు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పాములు, విషపురుగులు సైతం సంచరిస్తున్నాయి. చీకట్లో ఏం కనిపించక పోయినా తప్పనిసరి పరిస్థితిలో వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన దొంగల ముఠా తిరుగుతోంది. వీధుల్లో చీకటిగా ఉండడం మరింత భయానికి కారణం అవుతోంది. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆయాకాలనీల ప్రజలు కార్పొరేషన్ అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.



అంధకారంలో హైటెక్‌సిటీ కాలనీ

మంచిర్యాల కార్పొరేషన్ వివరాలు

నగరంలో మొత్తం డివిజన్లు	60
నివాస, వాణిజ్య గృహాలు	49,697
వీధి దీపాలు	24,750

నెలరోజుల్లో ఏర్పాటు చేస్తాం



నగరంలో వీధి దీపాలు వెలగని చోట కొత్త వాటిని అమర్చేందుకు టెండర్ నిర్వహించాం. నెల రోజుల్లో పూర్తిస్థాయిలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం పండుగల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా, బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నాం. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలను పునరుద్ధరించేలా చూస్తాం.

– సంపత్ కుమార్, కమిషనర్, మంచిర్యాల కార్పొరేషన్

ప్రత్యేక పాలనలో పట్టింపు లేదా?

పాలకవర్గం ఉన్నప్పుడు వార్డుల్లోని వీధి దీపాలపై ఎప్పటికప్పుడు ఆరా తీయడం, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వెనువెంటనే పోయిన చోట వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరుగుతుండేది. పండుగల సమయాల్లో మాత్రం అధికారులతో మాట్లాడి తప్పనిసరిగా వీధి దీపాలను ఏర్పాటు చేయించేవారు. పాలకవర్గం పదవీకాలం ఈ ఏడాది జనవరిలో పూర్తికాగా ప్రత్యేక అధికారుల పాలనలో ప్రస్తుతం కార్పొరేషన్ నిర్వహణ కొనసాగుతోంది. అందులోనూ నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను మంచిర్యాల మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఈ ఏడాది జనవరిలోనే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. ప్రత్యే క అధికారుల పాలన, కార్పొరేషన్ ఏర్పాటుతో ప్ర జలకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందడం లేదు. గతంలో వీధి దీపాల నిర్వహణ బాధ్యతను టెండర్ ద్వారా ఓ సంస్థకు కాంట్రాక్టు అప్పగించారు. గతేడాది టెండర్ ముగియడంతోనే వీధి దీపాల నిర్వహణ ప్రస్తుతం కార్పొరేషన్‌పై పడింది. గతంలో టెండర్ ద్వారా వీధి దీపాల నిర్వహణను పొందిన సంస్థ మొదట వీధి దీపాలు పోయిన చోట వెంటనే అమర్చడం, మరమ్మతులు చేపట్టడం బాగానే చేసినా టెండర్ ముగింపు సమయంలో క్రమక్రమంగా నిర్వహణ బాధ్యతలను విస్మరించింది. ఆ సంస్థ కాలపరిమితి ముగిసే సమయానికి నగరంలోని సగానికి పైగా వీధిదీపాలు వెలగకుండా ఉన్నాయి. ఆ తరువాత కార్పొరేషన్ అధికారులే వీధి దీపాల నిర్వహణను చేపట్టడంతో అందుబాటులో ఉన్న వీధి దీపాలను వెలగని చోట అమర్చారు. ఆ తరువాత వీధి దీపాల నిర్వహణ కష్టంగా మారుతూ వస్తోంది. ప్రస్తుతం నగరంలో చాలాచోట్ల, బతుకమ్మ, దసరా పండుగలను దృష్టిలో ఉంచుకుని బతుకమ్మ ఆడేందుకు వెళ్లే మార్గాల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, అక్కడక్కడ కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో వీధి దీపాలు వెలగని చోట పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు టెండర్ ప్రక్రి య నిర్వహించగా మరో నెల రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు ప్రజలకు నగరంలోని వీధుల్లో చీకట్లు తప్పేలా లేవు.

అమ్మకు నీరా'జనం'



దిలావర్‌పూర్ హనుమాన్ ఆలయం వద్ద ఆభరణాలను దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు



అడెల్లి బాలాలయంలో అమ్మవారి విగ్రహం

- వైభవంగా మహా పోచమ్మ ఆభరణాల శోభాయాత్ర
- అడుగడుగునా హారతి పట్టిన జనం
- కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- ముగిసిన 'అడెల్లి' గంగనీళ్ల జాతర

సారంగపూర్/దిలావర్‌పూర్: జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం గల అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర మహోత్సవం ఆదివారం ముగిసింది. శనివారం దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామంలోగల గోదావరి నదికి అశేష భక్తజన సందోహం మధ్య అమ్మవారి ఆభరణాల శోభాయాత్ర చేరింది. ఆదివారం తెల్లవారుజామున గోదావరి నీటితో భక్తులు ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం కాలినడకన ఆయా గ్రామాల మీదుగా తిరిగి అమ్మవారి ఆలయానికి ఆభరణాలు చేర్చారు. అమ్మవారికి నగలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో జాతర ముగిసింది.

దారి పొడవునా 'అమ్మ' నామస్మరణ

అడెల్లి పోచమ్మ తల్లి ఆభరణాల ఊరేగింపు శోభాయాత్ర శనివారం ఉదయం సారంగపూర్ మండలం అడెల్లి దేవస్థానం నుంచి దిలావర్‌పూర్ మండలంలోని కదిలి, మాడేగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా రాత్రి సాంగ్వి పోచమ్మ ఆలయం వరకు కొనసాగింది. అమ్మవారి ఆభరణాల వెంట వచ్చిన భక్తులు శనివారం రాత్రంతా పోచమ్మ ఆలయ పరిసరాల్లో అమ్మవారి నామస్మరణ చేస్తూ జాగరణలో పాల్గొన్నారు. 'గంగ నీకు శరణమే.. ఘనమైన పూజలే..' 'ఉయ్యాలో ఉయ్యాలో.. ఊరూవాడ జంపాలో..' 'పోచమ్మ తల్లి చల్లంగా చూడమ్మో..' అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుంటూ ఆటాపాటలతో ఆభరణాలను ఆదివారం తెల్లవారుజామున గోదావరి తీరానికి తీసుకువెళ్లారు. ఊరి పెద్దలు, అమ్మవారి ఆలయ పూజారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి నగలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరి జలాలను గడ ముంతల్లో తీసుకుని గంగనీళ్ల జాతరకు వచ్చిన భక్తులు అమ్మవారి ఆభరణాల వెంట వెళ్లారు. సాంగ్వి ఆలయం నుంచి ఉదయం ప్రారంభమైన గంగనీళ్ల జాతర అడెల్లి దేవస్థానానికి తిరుగు పయనమైంది. ఈక్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం, కదిలి గ్రామాల్లో స్థానిక నాయకులు అమ్మవారి ఆభరణాల శోభాయాత్రకు మేళతాళాలు, భాజాభజంత్రీలతో ఘనస్వాగతం పలికారు.

జాలుక దండతో ఘనస్వాగతం

దిలావర్‌పూర్ గ్రామానికి ఆభరణాల శోభాయాత్ర చేరుకోగానే గ్రామస్తులు జాలుక దండ (భారీ పూల తోరణం) తో స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన పోతరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు యాట పిల్లలను (గొర్రె పొట్టేళ్లు) బహూకరించారు. శివసత్తులు పూనకాలు, నృత్యాల మధ్య ముందుకుసాగారు. దారిపొడవునా అమ్మవారి ఆభరణాలపై పసుపు నీళ్లు చల్లుతూ, కొబ్బరి కాయలు కొడుతూ భక్తులు మొక్కు తీర్చుకున్నారు. యాకర్‌పెల్లి గ్రామ గంగపుత్రులు సన్నని వలతో గొడుగుపట్టి ఆభరణాలను గ్రామ పొలిమేరల వరకు సాగనంపారు.

కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

గంగనీళ్ల జాతర నేపథ్యంలో అడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్, మెదక్, మహారాష్ట్రల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

జన్నారం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బొజ్జు మాట్లాడుతూ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. విభేదాలను పక్కనపెట్టి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు ఇసాక్, శంకరయ్య, నందునాయక్, ఇందయ్య, కరుణాకర్, రమేశ్, పంకజ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

అడ్డా కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతాం

పాత మంచిర్యాల: టీయూసీఐ అనుబంధ కార్మిక సంఘమైన ప్రగతిశీల భవన నిర్మాణ అడ్డా కార్మిక సంఘం ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా మాదగాని రాములు, ప్రధాన కార్యదర్శిగా అగ్గు మహేష్, కోశాధికారిగా రేగుల సంపత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్డా కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతామన్నారు. అడ్డా కార్మికులకు భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజు, నాయకులు నరెడ్ల శ్రీనివాస్, పెద్దపల్లి సూరయ్య, పొట్టాల మల్లేశ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంపై గురిపెట్టి.. కొలువులు సాధించారు

- గ్రూప్–2లో మెరిసిన జిల్లావాసులు

నస్పూర్: వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు. అయినా వారి లక్ష్యానికి అవేమీ అడ్డురాలేదు. తల్లిదండ్రుల కష్టాలను దగ్గిరి నుంచి చూసినవారు తాము ఉన్నత స్థానాల్లో ఉండాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఈ క్రమంలో ఎదురైన ఆటంకాలను అధిగమించారు. గ్రూప్–2 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి కలల కొలువు సాధించారు.

నస్పూర్‌కు చెందిన ఇద్దరు..



వెంకటేశ్

ఆదివారం వెలువరించిన గ్రూప్–2 ఫలితాల్లో నస్పూర్ పట్టణానికి చెందిన ఇద్దరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీఎన్జీవోస్ కాలనీకి చెందిన పోలంపల్లి వెంకటేశ్ 337 ర్యాంకు సాధించి ఎంపీవో(మండల పరిషత్ అధికారి)గా ఎంపికయ్యారు. వెంకటేశ్ స్వగ్రామం హాజీపూర్ మండలం టీకన్నపల్లి. అతని తల్లిదండ్రులు లక్ష్మి–రాయలింగు స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వెంకటేశ్ 2014లో నిర్వహించిన వీఆర్వో పరీక్షలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచి కన్నెపల్లిలో, నస్పూర్‌లో వీఆర్వోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం లక్సెట్టిపేట డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఏఎస్‌వోగా వినయ్‌కుమార్..



వినయ్‌కుమార్

నస్పూర్ గ్రీన్ సిటీకి చెందిన ఆవుల వినయ్‌కుమార్ గ్రూప్–2లో 396 మార్కులు సాధించి ఏఎస్‌వో(అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)గా ఎంపికయ్యారు. తండ్రి ఆవుల దేవేందర్ ప్రస్తుతం పోలీస్ శాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా పెద్దపల్లి జిల్లా పొత్కపల్లిలో విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి తులసి గృహిణి. వినయ్‌కుమార్ బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈపీఎఫ్ కార్యాలయంలో అకౌంట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్–2కు సన్నద్ధమై విజయం సాధించాడు.

బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా సింగరేణి ఉద్యోగి కూతురు



సాయి శ్రీజ

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చుంచు సాయి శ్రీజ గ్రూప్–1 ప్రతిభ కనబర్చి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కొలువు సాధించింది. సాయిశ్రీజ తండ్రి చుంచు పోచయ్య సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి చంద్రకళ గృహిణి. అన్నయ్య సౌమిత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉ ద్యోగం చేస్తున్నారు. సాయిశ్రీజ ఒకటి నుండి పదవ తరగతి వరకు మంచిర్యాలలో చదువుకుంది. ఇంటర్మీడియెట్ నారాయణ కళాశాలలో, డిగ్రీ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. ఇటీవల గ్రూప్–4లో ఉద్యోగం సాధించి కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు.

తల్లి, సోదరుడి ప్రోత్సాహంతో..



సోదరి రమ్యకు మిఠాయి తినిపిస్తున్న వెంకటేశ్

బెల్లంపల్లి: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ బస్తీకి చెందిన ముత్తె రమ్య గ్రూప్–2 ఫలితాల్లో సత్తాచాటింది. జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా కొలువు దక్కించుకుంది. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా తల్లి, అన్న, వదిన ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివింది. బెల్లంపల్లిలో పదో తరగతి వరకు, వరంగల్‌లో ఇంటర్, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ చదివింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఇంటివద్దే సన్నద్ధమైంది. ఆశించినట్లుగానే గ్రూప్–2లో ప్రతిభ కనబర్చింది.

ఏఎస్సై కొడుకు డిప్యూటీ తహసీల్దార్



బొంతల వివేక్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బొంతల సత్తన్న కుమారుడు వివేక్ తొలి ప్రయత్నంలోనే గ్రూప్–2లో సత్తా చాటాడు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యాడు. పాత మంచిర్యాలకు చెందిన వివేక్ పదోతరగతి జిల్లా కేంద్రంలో చదివాడు. 2017లో బీటెక్ పూర్తి చేసి గ్రూప్–1 లక్ష్యంగా సిద్ధమయ్యాడు. గ్రూప్–1 మిస్ అయినా.. గ్రూప్–2లో ప్రతిభ కనబర్చి 348 ర్యాంక్ సాధించాడు.

నిరుపేద కుటుంబంలో పుట్టి..



రాజమల్లు

కోటపల్లి: మండలంలోని రొయ్యలపల్లి గ్రామానికి చెందిన బానయ్య–బానక్క దంపతుల కుమారుడు రాజమల్లు గ్రూప్–2లో ప్రతిభ కనబర్చి అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారిగా ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా సోదరుడు వ్యవసాయం చేస్తున్నాడు. రాజమల్లు మాత్రం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గ్రూప్–2కు సన్నద్ధమయ్యాడు. లక్ష్యాన్ని సాధించాడు.

ముల్కల్ల యువకుడి ప్రతిభ



గోళ్ల సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లకు చెందిన గోళ్ల సంతోశ్ గ్రూప్–2 ఫలితాల్లో 289 ర్యాంకు సాధించి ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. గతంలో అటవీశాఖలో బీట్ అధికారిగా పనిచేస్తున్న సంతోష్‌కు గ్రూప్–4లో ఉద్యోగం రావడంతో ప్రస్తుతం మంచిర్యాల వైద్య కళాశాలలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. సంతోశ్ తండ్రి రాజయ్య విశ్రాంత సింగరేణి ఉద్యోగి. తల్లి బాలమ్మ గృహిణి. సోదరుడు లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. సతీమణి శ్రీనిధి జైపూర్ పవర్ ప్లాంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది.

ఒకటికాదు.. ఆరు ఉద్యోగాలు..

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బానవత్ సంతోష్ ఆరు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచాడు. గ్రూప్–2 ఫలితాల్లో లా డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఏఎస్‌వో) ఉద్యోగం సాధించాడు. గతంలో సివిల్ కానిస్టేబుల్, పంచాయతీ కార్యదర్శి, జైలు వార్డర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం మంచిర్యాలలో కమర్షియల్ టాక్స్ విభాగంలో జూనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్–2 పరీక్షకు హాజరై అందులోనూ ప్రతిభ సాధించాడు. 1నుంచి 7 వరకు లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, 8 నుంచి 10వ తరగతి వరకు ఉట్నూర్‌లో, ఇంటర్ లక్సెట్టిపేట ప్రైవేటు కాలేజీలో, ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎమ్ పూర్తిచేశాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టినప్పటికీ, పట్టుదలతో చదివి ప్రభుత్వ కొలువులు సాధిస్తూ అందరిచే శభాష్ అనిపించుకున్నాడు. సంతోష్ తండ్రి భగ్గు 2009లో చనిపోగా, తల్లి విజయ, ముగ్గురు అక్కలు స్వప్న, స్వాతి, గీత కష్టపడి తనను చదివించడంతోనే తాను ప్రభుత్వ కొలువులు సాధించానని సంతోష్ తెలిపాడు.



తల్లి విజయతో సంతోష్

అందుబాటులోకి 'అమృత్ భారత్'

- ముజాఫర్‌పూర్–చర్లపల్లి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఉత్తరాది వాసులకు సౌకర్యం



అమృత్ భారత్ రైలు

బెల్లంపల్లి: ఉత్తరాది రాష్ట్రమైన బీహార్‌లోని ముజాఫర్‌పూర్ నుంచి హైదరాబాద్ సమీపంలోని చర్లపల్లి మధ్య నడిచే అమృత్ భారత్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీస్ మంచిర్యాల, కుమురంభీ ఆసిఫాబాద్ జిల్లావాసులకు అందుబాటులోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ రైలును సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజు వీక్లీ స్పెషల్‌గా నడిపి, అక్టోబర్ 14 నుంచి రెగ్యులర్ సర్వీస్‌గా మార్చనున్నట్లు సమాచారం. 14న ముజాఫర్‌పూర్ నుంచి చర్లపల్లికి బయలుదేరే ఈ రైలు, 16న తిరుగు ప్రయాణంలో చర్లపల్లి నుంచి ముజాఫర్‌పూర్‌కు వెళ్తుంది. తెలంగాణలో సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి జంక్షన్, కాజీపేట జంక్షన్ స్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వలస కార్మికుల సౌకర్యార్థం ఈ సర్వీస్ ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది.

ఉత్తరాది ప్రయాణికులకు ప్రయోజనం..

ఈ అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ తెలంగాణ ప్రాంతవాసులకు గణనీయమైన లాభాలు చేకూరుస్తుంది. తక్కువ స్టేషన్లలో మాత్రమే ఆగడంతో వేగవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ప్రస్తుతం అవసరాలకు తగిన రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులకు ఉపయోగపడుతుంది. మొదట వారాంతపు రైలుగా నడిపి, ప్రయాణికుల స్పందన ఆధారంగా రెగ్యులర్‌గా మార్చాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు. రెగ్యులర్ సర్వీస్ అమలు కావడంతో మరిన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఏసీ సదుపాయం మినహా, మిగిలిన అన్ని సౌకర్యాలు వందే భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌తో సమానంగా ఉంటాయి.

22 కోచ్‌లు..

ప్రయాణికుల సౌలభ్యాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని అమృత్ భారత్ రైలును 22 కోచ్‌లతో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 11 జనరల్ అన్ రిజర్వ్‌డ్ కోచ్‌లు, 8 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 2 ఎస్ఎల్ఆర్ కోచ్‌లు, 1 లగేజ్ కోచ్ ఉన్నాయి. ముందు, వెనక రెండు ఇంజిన్లు జతచేస్తారు. ముజాఫర్‌పూర్ నుంచి ప్రతీ మంగళవారం ఉదయం 10:40కి బయలుదేరి, బుధవారం రాత్రి 11:50 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు మార్గంలో గురువారం తెల్లవారుజామున 4:05 గంటలకు చర్లపల్లి నుంచి ప్రారంభమై, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముజాఫర్‌పూర్‌కు చేరుకుంటుంది.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై అశోక్

కుంటాల: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కుంటాలకు చెందిన సక్రపు సురేష్ దంపతులు శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం నిర్మల్ వెళ్లారు. పక్కింటివారు శనివారం సాయంత్రం తలుపులు తెరిచి ఉండడంతో వారికి సమాచారం అందించారు. బీరువాలో రూ.10వేల నగదుతోపాటు 4 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. రూ.40 వేల విలువ గల వెండిని వదిలేసి వెళ్లారు. పక్క గదిలోనే టీజీబీ బ్యాంకులో పనిచేస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ అద్దెకు ఉంటున్నాడు. ఆ గది తాళం పగులగొట్టి వస్తువులను చిందరవందర పడేశారు. నిర్మల్ నుంచి క్లూస్ టీం సిబ్బంది వచ్చి సేకరించారు. ఎస్సై అశోక్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు సురేష్ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్టు కుడి కాలువ గేట్‌వాల్ ధ్వంసం

కోటపల్లి: మండలంలోని ఆయపల్లి రెవెన్యూ శివారులోని ప్రాజెక్టు కుడికాలువ గేట్‌వాల్‌ను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రోయ్యలపల్లి, ఆల్గామ, పుల్లగామ, సిర్సా, ఎదులబంధం, జనగామ, సుపాక, వెంచపల్లి గ్రామాల రైతుల సుమారు 300 ఎకరాల వరికి ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతుంది. ఆలుగామ గ్రామానికి చెందిన కొంతమంది తమ చేనులోకి నీరు వచ్చి పంటలు నాశనం అవుతున్నాయని.. ప్రాజెక్టు కుడి కాలువ గేట్ ధ్వంసం చేశారు. ప్రాజెక్టులోని నీరు వెళ్లిపోయేలా చేశారు. రెండు రోజులుగా నీరు వృథాగా పోతుంది. అధికారులు దుండగులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తిపై పీడీ యాక్ట్

ఉట్నూర్‌రూరల్: ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి ఆదివారం చంచల్‌గూడ జైలు తరలించినట్లు ఉట్నూర్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన జవాడే కృష్ణ ఎలాంటి అనుమతి లేకుండా ఉట్నూర్, ఆదిలాబాద్‌లో డిజి టల్ మైక్రో ఫైనాన్స్ కార్యాలయాలు తెరిచాడు. ఉద్యోగాలు ఇస్తానని సుమారు 300కు పైగా నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు వసూలు చేసి మోసం చేశారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో నిందితుడిపై 25 కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి ఆదేశాలతో నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందించి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో ఈనెల 27న బైక్ చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వ్యాపారవేత్త అబ్దుల్ రహీం ఈనెల 27న రాంనగర్ కాలనీలోని సెవన్‌హిల్స్ బ్రేక్‌ఫాస్ట్ ఎదుట బైక్ పార్కింగ్ చేశాడు. తర్వాత కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మావల సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. షేక్ సద్దాం, రాథోడ్ సుధాకర్ వాహనాలు తనిఖీ చేయగా వారిపై అనుమానంతో విచారించగా బైక్‌ను చోరీ చేసినట్లు అంగీకరించారు. ఇద్దరిని అరెస్టు చేయగా మరో వ్యక్తి పింకు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్
REAL ESTATE
భూమి కావలెను
■భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716.
[SCA25008551]
www.sakshi.com
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

మూలనక్షత్ర పూజలకు సిద్ధం

- ముస్తాబైన బాసర సరస్వతీ ఆలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


అమ్మవారు


బాసర గోదావరి నది ప్రవాహంతో గంగమ్మ వద్ద వరదనీరు

భైంసా/బాసర: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసరలో జ్ఞాన సరస్వతీ ఆలయం సోమవారం మూలనక్షత్ర పూజలకు ముస్తాబైంది. ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 11 గంటలకు పూజలు జరగనుంది. వేకువజాము నుంచి అర్చకులు, వైదిక బృందం చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. ఈ శుభ ఘడియాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు తెలుగు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వసంత పంచమి, దసరా నవరాత్రుల్లో వచ్చే మూలనక్షత్రం రోజు వేలాది సంఖ్యలో ఏటా తరలివచ్చి దర్శించుకుంటారు. అమ్మవారి చెంత అక్షరాభ్యాసాలు జరిపిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వారి నమ్మకం. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలతో ఈవో అంజనీదేవి ప్రత్యేక చర్యలు చేపటారు. ఎస్పీ జానకీషర్మిల, భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక అలంకరణ

మూలనక్షత్ర పూజల కోసం బాసర ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే అక్షరాభ్యాసంతోపాటు ఇతర పూజ టికెట్ల విక్రయాలు జరిపించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే భక్తులు బాసర ఆలయంతోపాటు ప్రైవేటు లాడ్జీల్లో గదులు బుకింగ్ చేసుకున్నారు.

భయపెడుతున్న వరద

ఓ వైపు మూలనక్షత్రం.. మరోవైపు గోదావరి వరద భక్తులను భయపెడుతోంది. గతనెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే గోదావరి ఉప్పొంగింది. బాసర ఆలయ ప్రాంగణాన్ని ముంచెత్తింది. నవరాత్రోత్సవాల ప్రారంభంలో మూడురోజులు వర్షంలోనే ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆదివారం గోదావరి ఉప్పొంగి ప్రవహించింది. ఆలయానికి వెళ్లే మార్గం, స్నానఘట్టాలు, గంగమ్మ తల్లి, సూర్యేశ్వర ఆలయాల ప్రాంగణంలో వరద నీరు చేరింది. సోమవారం ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షం కురిస్తే వచ్చే వరద నీరుతో భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి.

వరద ఉధృతి పరిశీలన


మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

బాసర: ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షానికి బాసర గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆదివారం గోదావరి వద్ద వరద ఉధృతిని, లోతట్టు ప్రాంతాలను భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. సోమవారం మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయసమీపంలో ప్రైవేటు లాడ్జీల వరకు బ్యాక్‌వాటర్ రావడంతో ముందుగా వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అంతకు ముందు ఎస్పీ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

మూలనక్షత్ర పూజలకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశాం. తరలివచ్చే భక్తులకు క్యూలైన్ ఏర్పాట్లు చేసి పాలు, పండ్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. ప్రసాదాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశాం. పోలీసు అధికారులు పకడ్బందీగా బందోబస్తు పర్యవేక్షిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– అంజనీదేవి, ఈవో

అడవిపంది మాంసం పట్టివేత

- నలుగురి అరెస్ట్


నిందితులతో ఎఫ్ఆర్వో పూర్ణచందర్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దు పంచాయతీ పరిధి కాశిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం అడవి పంది మాంసం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో పూర్ణచందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పక్కా సమాచారంతో అటవీ అధికారులు కాశిరెడ్డిపల్లె గ్రామంలో దాడి నిర్వహించారు. గ్రామానికి చెందిన గంధం రాజన్న, సిరిగిరి సాయి వద్ద అడవి పంది మాంసం ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వారిని విచారించగా కన్నాల గ్రామానికి చెందిన ముస్కె శ్రీనివాస్, జంగెపల్లి చంద్రమొగిళి తమకు విక్రయించారని అంగీకరించారు. శనివారం సాయంత్రం చంద్రమొగిళి పత్తి చేనులో విద్యుత్ వైర్లు అమర్చి రెండు అడవి పందులను హతమార్చినట్లు విచారణలో తేలింది. రాజన్న, సాయి, శ్రీనివాస్, చంద్రమొగిళిని అరెస్ట్ చేసి ఎఫ్ఆర్వో కార్యాలయానికి తరలించారు. వారి వద్ద నుంచి అడవి పంది మాంసం, వేటకు ఉపయోగించిన విద్యుత్ వైర్లు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. ఈ దాడిలో డిప్యూటీ ఎఫ్ఆర్వోలు తిరుపతి, గౌరీశంకర్, బీట్ ఆఫీసర్లు గోపికృష్ణ, రాజు, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ నోట్ల కలకలం

- చిన్నారులు ఆడుకునే నోట్లుగా గుర్తింపు


చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోట్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేటలో ఆదివారం నకిలీ నోట్ల కలకలం సృష్టించింది. నోట్ల మార్పిడి అంటూ దావనంలా వ్యాపించింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గుడిపేట లిక్కర్ గోదాం సమీపంలో కొంతమంది కారులో రాగా, మరొకరు బైక్‌పై వచ్చారు. వీరంతా డబ్బు పంపకాలు చేసుకుంటుండగా వారిలో ఒక్కసారిగా వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు వారిని నిలదీయడంతో ఇరువర్గాల వ్యక్తులు కొందరు కారులో లక్సెట్టిపేట వైపు, మరికొందరు ఆటోలో మంచిర్యాల వైపు పారిపోయారు. అయితే అక్కడ ఉండిపోయిన మరో వ్యక్తి తన వద్ద రూ.లక్ష దొంగిలించుకుని పారిపోయారని చెప్పగా స్థానికులు అనుమానంతో నిలదీశారు. తన వద్ద ఉన్న సంచిని అక్కడ వదిలి పారిపోయాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఘటన స్థలానికి చేరుకుని విచారించారు. సంచి పట్టుకుని వెళ్లిన స్థానికుడి వద్దకు వెళ్లి పరిశీలించగా రూ.500గా ఉన్న ఓ పది కట్టలు చిన్న పిల్లలు ఆడుకునే చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోట్లుగా గుర్తించారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్‌లు ఈ ఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


రాకేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: చేపల వేటకు వెళ్లి యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన చింతల లచ్చయ్య–లచ్చమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. ఇందులో రాకేశ్(22) చిన్న కుమారుడు. కూలీ పని చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. ఆదివారం ఉదయం రాళ్లవాగులో చేపల వేటకని వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మూడు గంటల పాటు రాళ్లవాగులో ఎయిర్ బోట్ సహాయంతో గాలించారు. నీటి మడుగులో రాకేశ్ మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని దుర్గానగర్ శంకర్ గుట్టకు చెందిన 30 ఏళ్ల వయస్సు గల వివాహిత శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని రైలు పట్టాలపై రాత్రి అడ్డంగా పడుకోవడంతో గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకుని ఆమెను సఖీ కేంద్రానికి తరలించారు. తర్వాత చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. సఖీ సిబ్బంది ఆమెను విచారించగా, తనకు ఇదివరకే పెళ్లయిందని, భర్త దూరంగా ఉన్నాడని పేర్కొంది. తనను మరో వ్యక్తి వేధింపులకు పాల్పడడంతో అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలిపింది. తాను ఇంట్లో ఉన్న 20 మాత్రలను ఒకేసారి మింగేసినట్లు చెప్పింది. ఈ విషయమై టూటౌన్ సీఐ నాగరాజును సంప్రదించగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర మార్గంలో మహీంద్ర షోరూం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. ముథోల్ మండలం తరోడకు చెందిన జి దేవానంద్(35) ఆదివారం రాత్రి భైంసా వైపు నుంచి తరోడకు వెళ్తుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో దేవానంద్ ఘటనాస్థలిలోనే మృతిచెందాడు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి సర్కిల్ రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పొన్నారం గ్రామంలో తోట మల్లమ్మ అనే వృద్ధురాలి మెడలో పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. శనివారం రాత్రి మల్లమ్మ ఇంటి ఆవరణ ముందు షెడ్డులో నిద్రిస్తుండగా ఆమె మెడలోని తులంన్నర బంగారు పుస్తెల తాడును గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. వృద్ధురాలు అరుస్తూ బయటకు రాగా పారిపోయాడు. వృద్ధురాలి కుమారుడు తోట చంద్రయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఆదివారం పొన్నారంలోని వృద్ధురాలిని కలిసి వివరాలు తెలుసుకున్నారు.

ఎస్టీపీపీ జీఎంగా నర్సింహారావు


నర్సింహారావు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఈఅండ్ఎం) జీఎంగా ఎం.నర్సింహారావు నియమిస్తూ సంస్థ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇంతకాలం ఎస్టీపీపీ జీఎంగా విధులు నిర్వర్తించిన కె.శ్రీనివాసులు కార్పొరేట్‌కు బదిలీ కాగా, ఎస్టీపీపీలోనే జీఎంగా పనిచేస్తున్న నర్సింహారావును నియమించారు. అదేవిధంగా ఎం.మదన్‌మోహన్ ఏజీఎం(ఈ అండ్ఎం)గా పనిచేస్తుండగా ఇదే ఎస్టీపీపీలో పర్చస్ ఏజీఎంగా బదిలీ చేశారు.

పంట దిగుబడి రాదని ప్రాణం తీసుకున్నాడు


నల్లగంటి దేవన్న(ఫైల్)

సాత్నాల: అతివృష్టి కారణంగా వేసిన పంట నీటమునిగింది. వర్షాలు తగ్గినా దిగుబడి వచ్చే అవకాశం లేదు. దీంతో మనోవేదనకు గురైన ఓ రైతు ప్రాణం తీసుకున్నాడు. భోరజ్ మండలంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన నల్లగంటి దేవన్న(46) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ వానాకాలం మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగుచేశాడు. పెట్టుబడికి రూ.80 వేలు ఖర్చు కాగా,, రూ.లక్ష అప్పు ఉంది. భారీ వర్షాలకు పంట పూర్తిగా మునిగిపోయింది. దీంతో దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. మరోవైపు పెళ్లీడుకొచ్చిన కూతురు వివాహం ఎలా చేయాలని దిగాలు చెందాడు. ఈ క్రమంలో గత గురువారం కుటుంబ సభ్యులు దుర్గపూజకు వెళ్లగా దేవన్న పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చాక గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. దేవన్న కూతురు ప్రశాంతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్‌పవార్ తెలిపారు.

అటవీశాఖ అడ్డంకులు లేకుండా చూడాలి


ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని లింగాల పంచాయతీ శివారు అటవీ ప్రాంతంలో దసిలిపట్టు సాగుకు అటవీ శాఖ అడ్డంకులు లేకుండా చూడాలని ఆదివాసీ రైతులు కోరారు. ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నర్సింగారావు, నాయకులు అజ్జు, రైతులు ఉన్నారు.

‘ఎల్లంపల్లి’ 43 గేట్ల ఎత్తివేత



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎంత ఉందో అంతే స్థాయిలో అవుట్ ఫ్లో ఉంది. ప్రాజెక్ట్‌లోని 43 గేట్ల ఎత్తివేసి దాదాపు 5 టీఎంసీలకు పైగా వరద నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఆదివారం రాత్రి వరకు ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 145.50 మీటర్లు ఉండగా 20.175 టీఎంసీలకు గాను 13.825 టీఎంసీలతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 2 లక్షలు, ఎస్సారెస్పీ నుంచి 4.50 లక్షలు, కడెం నుంచి 5 వేలు మొత్తం 6.50 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ పథకానికి 303 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. 43 గేట్లు తెరవడంతో 6.60 లక్షల క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు.

బతుకమ్మ వేడుకలకు ఆర్‌కేపీ ముస్తాబు


ముస్తాబైన ఆర్‌కేపీ సింగరేణి స్టేడియం

రామకృష్ణాపూర్: బతుకమ్మ వేడుకలకు పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియం, సీహెచ్‌పీలు ముస్తాబయ్యాయి. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో అధికారులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సుమారు 10వేల మందికి పైగా మహిళలు పాల్గొనే అవకాశం ఉండటంతో బతుకమ్మ ఆటలు ఆడేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్‌కేపీ సీహెచ్‌పీతోపాటు ఠాగూర్ స్టేడియంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వీలుగా తాత్కాలిక మడుగులను ఏర్పాటు చేశారు. ఆదివారం సింగరేణి అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు వేడుకలు ప్రారంభం కానుండగా ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేయనున్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బోరిగం రాజారాం

శ్రీరాంపూర్: కులస్తులందరూ ఐక్యతతో ఉంటేనే అభివృద్ధి సాధిస్తారని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం తెలిపారు. పటేల్స్ ఎంటర్‌ప్రెన్యూర్ నెట్వర్క్ (పెన్) ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మున్నూరు కాపు కులస్తుల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్ అనే సంస్థలో మున్నూరు కాపు సభ్యులు చేరాలన్నారు. ఇందులో అన్నివర్గాల వారు ఉన్నారని, దీనివల్ల అవసరం వచ్చినప్పుడు ఒకరికొకరు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. పెన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భరత్‌కుమార్ మాట్లాడుతూ పెన్ సంస్థలో ప్రస్తుతం లక్ష మంది ఉన్నారని, దీన్ని 25 లక్షలకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాదినేని రమేశ్, కాసెట్టి సుధాకర్, అభినవ్ శేఖర్, పెంచాల వేణు, భాస్కర్ల రాజేశం, బోరిగం వెంకటేశం, నెమలికొండ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

- టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్


టీఎన్జీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్వర్

నస్పూర్: ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్నామని టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణ పరిధిలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్(టీఎన్జీఓ)కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 317 బాధితులకు ఉపయోగపడేలా జీవో 190ను సాధించిన ఘనత టీజీఈజేసీదే అని అన్నారు. ఉద్యోగుల సమస్యల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీతో చర్చలు జరిపి పరిష్కరించుకుంటామన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ ఏర్పాటుతో హెచ్ఆర్ఏ పెంపొందించేందుకు కృషి చేయాలని స్థానిక నాయకులు ఆయన్ను కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సంద అశోక్, జిల్లా అధ్యక్షులు శ్రీహరి, మాజీ అధ్యక్షుడు సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, నాయకులు సతీశ్‌కుమార్, రాణి, శ్రీనివాస్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన టీఎన్జీఓస్ కేంద్ర అధ్యక్షుడు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల టీఎన్జీఓస్ కాలనీలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆదివారం మొక్కలు నాటా రు. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, మాజీ అధ్యక్షుడు సురేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, కేంద్రం సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, జిల్లా, మంచిర్యాల యూనిట్ల టీఎన్జీఓస్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న వెంకటస్వామి

బెల్లంపల్లి: ఎన్నికల హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి విమర్శించారు. పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సంఘం జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మృతి చెందిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని జీవో ఉన్న మున్సిపల్ కమిషనర్లు అమలు చేయడం లేదన్నారు. ఈఎస్ఐ డబ్బులు జమచేయడం లేదన్నారు. ఈ కారణంగా ప్రమాదం బారినపడిన కార్మికులకు వైద్యసేవలు అందకుండా పోతున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులకు ఒకపూట పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రకటించారు. అనంతరం 15 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీఐటీయూ మండల కన్వీనర్ సీహెచ్.దేవదాస్, నాయకులు రవి, శ్రీనివాస్, ప్రభాకర్, రాజేష్, లక్ష్మీనారాయణ, కమల్, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా క్యూ


దుగ్నెపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద క్యూలైన్‌లో రైతులు


కన్నెపల్లిలో యూరియా కోసం వర్షంలో బారులు తీరిన రైతులు

చెన్నూర్‌రూరల్/భీమిని: చెన్నూర్ మండలం దుగ్నెపల్లి గ్రామంలోని హాకా రైతు సేవా కేంద్రానికి, కన్నెపల్లిలోని హాకా సెంటర్‌కు ఆదివారం 266 చొప్పున యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే కేంద్రం వద్ద క్యూ కట్టారు. వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాలలోని రైతు వేదికల వద్ద ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున అందించారు.